ఆకుకూరలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పీలేరు: రసాయనిక ఎరువులు వినియోగించని పెరటి కూరగాయలు ఆకుకూరలతో ఎంతో ఆరోగ్యమని ఉద్యాన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఒంటిల్లు గ్రామంలో చిన్న గొట్టిగల్లు బ్లాక్ ఆత్మ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మహిళా రైతులకు పెరటి తోటల పెంపకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వనరుల నిపుణులుగా హాజరైన పీలేరు మడల ఉద్యాన అధికారి మాట్లాడుతూ పెరటితోటల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను, ఎరువులు, పురుగు మందుల వాడకం లేని, కలుషితం కాని ఆరోగ్యకరమైన ఆహారాన్ని కుటుంబ సభ్యులు అందరూ తినవచ్చని తెలిపారు. ప్రస్తుత కాలంలో విపరీతంగా ఎరువులు, పురుగు మందులు వాడి పండించిన కూరగాయలు, ఇతర ఉత్ప త్తులను వినియోగించడం ద్వారా మానవుడు పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడన్నారు. ఆత్మ బిటిఎం జ్యోత్స్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పెరటి తోటల పెంపకాన్ని చేపట్టడం ద్వారా సాంఘిక బాధ్యత పెరిగి, ఆరోగ్యవంతమైన కూరగాయలు, ఇతర ఉత్పత్తులను పండించి అనారోగ్యాలకు స్వస్తి చెప్ప వచ్చన్నారు. కార్యక్రమంలో ఆకు కూరలు, తీగ జాతి, బెండ, ముల్లంగి, గోరుచిక్కుడు, నేల చిక్కుడు రకాల విత్తనాల మినీ కిడ్స్ 50 మంది రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రైతులు, వెలుగు సిసి చంద్రకళ పాల్గొన్నారు.

'అన్నమయ్య'ను నిర్మించే బాధ్యత కూటమిదే

ప్రజావేదికలో మాట్లాడుతున్న సిఎం

పింఛను ఇవ్వడం.. ఓ బాధ్యత
వైసిపికి ఓటేసి జిల్లా అడుగుతారా!
మూడేళ్లలో కడప, రైల్వేకోడూరుకు కృష్ణాజలాలు
రాజంపేట ప్రజావేదికలో సిఎం చంద్రబాబునాయుడు

పింఛను పంపిణీ చేస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య రిజర్వాయర్‌ను పున:నిర్మించే బాధ్యత కూటమి సర్కారుదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేట మండల పరిధిలోని కె.బోయనపల్లిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ, కార్యకర్తల సమావేశం, పేదలసేవలో..ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పింఛన్ పంపిణీ చేసిన అనంతరం దోబీఘాట్లను సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. దోభీఘాట్లలో షెడ్లు నిర్మించాలని రజకులు కోరగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ప్రజావేదిక చేరుకుని స్టాళ్లను పరిశీలించి ప్రసంగించారు. వైసిపి హయాంలో గల్లంతైన అన్నమయ్య రిజర్వాయర్‌ను నిపుణుల సూచనలు, సలహా మేరకు యథాతథంగా నిర్మించే బాధ్యత కూటమి సర్కారు తీసుకుంటుందన్నారు. పింఛన్ ఇవ్వడం దానం, ధర్మం కాదని సామాజిక బాధ్యత అన్నారు. జిల్లాలో 1,20,187 మందికి రూ.101 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. పేదరిక నిర్మూలనకు వెలుగు, డ్వాక్రా వంటి స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రాన్ని పున:నిర్మాణం చేయడానికి అందరి సహకారం అవసరమని భావించి ముందుకెళ్తే 90 శాతం స్ట్రైక్‌రేట్ ఫలితాలు సాధించామని చెప్పారు. రాయలసీమను హార్టీ హబ్‌గా మారుస్తామని తెలిపారు. గోదావరి నుంచి రెండు వేల టిఎంసిలు సముద్రం పాలవుతున్నాయన్నారు. రాయలసీమలోని కుప్పానికి కృష్ణాజలాలను తీసుకెళ్లామని, రెండో ఏడాది చిత్తూరు, మదనపల్లి, పీలేరు, గాలేరు-నగరి, మూడోఏడాది కడప, రైల్వేకోడూరుకు సైతం నీళ్లిస్తామని తెలిపారు. ప్రతిఏటా ఒన్ ఫ్యామిలీ..ఒన్ ఎంటర్ ప్రెన్యూర్ సాధిస్తామన్నారు. మోసం చేసిన వైసిపికి ఓటేసి రాజంపేటను జిల్లాను చేయడమంటే ఎలా అని వ్యాఖ్యానించారు. భద్రాచలం పోయిన తర్వాత ఒంటిమిట్ట రామాలయాన్ని టిటిడి దత్తకు తీసుకుని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు ప్రతిపాదన మేరకు రాజంపేటకు మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. పి4 ద్వారా సామాజిక అసమానతలు తగ్గించడమే ఆశయమని చెప్పారు. అంతకుముందు పెద కారంపల్లికి చెందిన వికలాంగురాలు సుమిత్రమ్మకు పింఛన్ అందించారు. అనంతరం రాజం పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. మెడికల్ కళాశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారులు నిర్మిస్తున్నారని, రాష్ట్ర రహదారి, గ్రీన్‌ఫీల్డ్ రహదారిని కలుపు రింగురోడ్డు ఏర్పాటు చేయడం ద్వారా రాజంపేట అభివృద్ధి చెందుతుందని విజ్ఞప్తి చేశారు. అనంతరం పి4 పథకం కింద బోయనపల్లికి చెందిన కల్యాణి, ఏసమ్మ కుటుంబాలను ఆదుకునే బాధ్యతలను యు.సుబ్రమణ్యం, ఎస్.వెంకటరమణ అనే మార్గదర్శులకు అప్పగించారు. అంతకుముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో సంబేపల్లిలో నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమం సందర్భంగా లోకేష్, వెంకటరమణ అనే మార్గదర్శులు పి4 ద్వారా రూ.7.50 లక్షలతో ఇళ్లు కట్టించి ఇచ్చారని, ఇళ్ల ఓపెనింగ్ కార్య క్రమానికి హాజరు కావాలని లబ్ధిదారులు కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, పెద్దఎత్తున కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారు.

దోబీఘాట్లను పరిశీలిస్తున్న చంద్రబాబు

వికలాంగురాలిని పరామరిస్తున్న సిఎం చంద్రబాబు

చిత్రమాలికను పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు

సిపిఎం నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్/చిట్వేలి

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజంపేట పర్యటనకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాక సందర్భంగా పలువురు సిపిఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులతో గృహ నిర్బంధం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, రైతు సంఘం నాయకులు పంది కాళ్ళ మణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహను ఎటు వంటి సమాచారం ఇవ్వకుండా ముందస్తు అరెస్టు చేసి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నరసింహను ఆదివారం రాత్రి పెనగలూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే వామపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని, అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరన్నారు. స్థానిక సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇచ్చే హక్కు కూడా తమకు లేదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి వ్యత్యాసం ఏమీ లేదన్నారు. వామపక్ష పార్టీలు అంటే ప్రభుత్వానికి భయం ఎందుకని నిలదీశారు.

గృహ నిర్బంధంలో సిపిఎం నాయకులు రవికుమార్, చిట్వేలి పోలీసుస్టేషన్‌లో మణి

ప్రజల చెవిలో చంద్రబాబు పువ్వు

- అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాజంపేట మండలం, బోయినపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా జిల్లా ప్రజల చెవిలో పువ్వులు పెట్టి మోసం చేశారని సిపిఎం అన్నమయ్య జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రిపై గంపెడు ఆశలు పెట్టుకున్న ప్రజలకు ఏమి చేస్తారో స్పష్టంగా చెప్పకుండా మోసం చేశారన్నారు. బొయనపల్లి ప్రజా వేదిక సభ నుంచి మాట్లాడిన చంద్రబాబు ఆద్యంతం తనను తాను పొగుడుకోవడానికి, వైసిపి ని విమర్శించడానికి పరిమితం అయ్యారని ఎలిపారు. ఇందు కోసం కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం చేయడానికి కారణం అయ్యిందని ఆరోపించారు. కడప, బెంగళూరు రైల్వే లైనుకు నిధులు, అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మానంపైనా, బొప్పాయి రైతుల ఆదుకోవడం, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పన, అభివృద్ధి కి నిధులు విడుదల మొదలగు వాటి గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం దుర్మార్గం అన్నారు. కేవలం పెన్షన్ల పంపిణీ ప్రచారం కోసం ముఖ్యమంత్రి రావాల్సిన అవసరం లేదని అన్నారు. జిల్లా ప్రజలను మోసం చేసిన చంద్రబాబును భవిష్యత్తులో జిల్లాలో అడుగుపెట్టనీయమని పేర్కొన్నారు.

కార్యదర్శి మణికి చంద్రబాబు ప్రశంసలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురవంక పంచాయతీ కార్యదర్శి మణికుమార్‌ను శభాష్ అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు మణికుమార్ ఆగస్టు15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్న సంగతి విదితమే. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేటలో పర్యటించారు. ఈ నేపథ్యంలో మణికుమార్ ప్రతిభను గుర్తించిన కలెక్టర్ స్టాల్స్ ఏర్పాటు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. స్టాల్స్ అద్భుతంగా ఉన్నాయని సిఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్ శ్రీధర్ చామకూరి, పంచాయతీ కార్యదర్శి మణికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ తనను ముఖ్యమంత్రి ప్రశంసించడం ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు.

సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పట్టణంలోని సంతాన సాఫల్య కేంద్రాలను సోమవారం వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య డిప్యూటీ డెమో దేవ శిరోమణి రికార్డులు, గుర్తింపు పత్రాలు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు రోజులుగా సంతా సాఫల్య కేంద్రాలను, ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. ఫెర్టిలిటి సెంటర్స్, సంతాన సాఫల్య కేంద్రాల పేరుతో కొందరు పిల్లలు కావాలనుకున్న తల్లిదండ్రులను మోసం చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 ఐయుఐ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రులను కూడా తనిఖీలు చేశామన్నారు. అనుమతులు లేని ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లపై చర్యలు తప్పవంటూ ఆయన హెచ్చరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం : కాంగ్రెస్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓట్ చోర్.. గద్ది చోడ్ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలసి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుండి గాంధీ బస్టాండ్ వరకు కాంగ్రెస్ పార్టీ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బిజెపి ఓట్లు దొంగతనం చేసి అధికారంలోకి వచ్చిందని, ఇందుకు సంబంధించిన ఆధారాలను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బెంగళూరులో జరిగిన ప్రెస్‌మీట్‌లో దేశ ప్రజల ముందు ఉంచారని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు బిజెపికి అనుకూలంగా జరుగుతున్నా పట్టించుకోవాల్సిన ఎన్నికల కమీషన్ బిజెపికి కొమ్ముకాస్తూ ప్రజల ఓటు హక్కును హరిస్తుందని ఆరోపించారు. బిహార్‌లో సుమారు 65 లక్షల ఓట్లు తొలగించబడిన విషయాన్ని రాహుల్ గాంధీ వెలుగులోకి తెచ్చారన్నారు. బిజెపి చేస్తున్న అన్యాయాలను ప్రజలకు తెలియజేసేందుకు రాహుల్ గాంధీ 13రోజుల పాటు అధికార యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కమిటీ ఉపాధ్యక్షులు సింగం రామక్రిష్ణరెడ్డి, మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె బాష, నాయకులు సురేందర్‌రెడ్డి, సయ్యద్ ఇదైతుల్లా హుస్సేన్, పరేశ, మల్లిక, ఖాజా, ఆదినారాయణ, గిరి పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా

ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మంచి రోజులు వస్తాయని ఎవరు అధైర్య పడకుండా ఉండాలని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందులలో మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బెంగళూరు నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందుల చేరుకొని వైసిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు నుంచి విజ్ఞప్తులను స్వీకరించి మీ సమస్యలను పరిష్క రించే విధంగా చూస్తామని తెలిపారు. ప్రభుత్వం వినకపోతే పోరాటాలు చేసే దానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా నేనున్నానని వారికి భరోసా ఇచ్చారు. కూటమి నాయకులు దాడులకు ఎవరు భయప డకూడదని ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని వారికి సూచించారు. మంగళవారం ఉదయం తన తండ్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయకు వెళ్లి వైఎస్ఆర్ సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించనున్నారు. అనంతరం పలు కార్యక్రమాలలో పాల్గొం టారు. పులివెందులకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భాకరాపురంలోని హెలిప్యాడ్ దగ్గర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గండికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్.మనోహర్‌రెడ్డి, అభిమానులు కార్యకర్తలు పుష్పగుచ్చం, శాలువాలులతో స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున అభిమానులు సెల్ఫీల కోసం నిలబడ్డారు. ప్రతి ఒక్కరితో సెల్ఫీలు తీసుకున్నారు.

సమస్యలు వింటున్న జగన్

'అన్నమయ్య'కు శాశ్వత పరిష్కారం చూపాలి

- పిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-కడప

రాజంపేటకు రెండు సార్లు వచ్చి పోయినా ప్రాజెక్ట్ పనులకు మోక్షం లేదని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం ఆమె కడపకు వచ్చారు. స్థానిక డిసిసి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకు పోయి ఐదేళ్లుదాటినా పునర్ నిర్మాణానికి దిక్కులేదని తెలిపారు. రాజంపేట వేదికగా మళ్లీ మాయమాటలు చెప్పారు తప్పిస్తే ప్రాజెక్ట్ నిర్మాణంపై దిశానిర్దేశం లేకపోవడం శోచనీయమన్నారు. అన్నమయ్య కన్నీటి వ్యథకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా నీటి నిల్వ లేక 30 వేల ఎకరాలకు సాగునీరు పారడం లేదన్నారు. లక్షమందికి తాగునీరు అందలేదని తెలిపారు. వెంటనే పూర్తి స్థాయి నిధులు కేటాయించి అన్నమయ్య ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని, డ్యామ్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు హామీల మేరకు పూర్తి స్థాయి జరగాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొ న్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మందిని బలిగొన్న ఘోర విపత్తులో జరిగిన నష్టాన్ని పూడ్చే మనసు ప్రభుత్వాలకు లేదని విమర్శించారు. సర్వం కోల్పోయిన నిరాశ్రయులను నేటికి ఆదుకోలేదని చెప్పారు. గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు కలిసి అన్నమయ్య ప్రాజెక్ట్‌ను అనాథ ప్రాజెక్ట్‌గా మార్చారన్నారు.

ఇడుపులపాయలో షర్మిల బస

వేంపల్లె : జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గెస్ట్‌హౌస్‌లో పిసిసి అధ్యక్షులు షర్మిల బస చేశారు. సోమవారం కడపకు కుటుంబ సభ్యులతో విచ్చేసిన ఆమె కడపలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో షర్మిలతో పాటు కుమారుడు రాజారెడ్డి, కోడలు అట్లూరి ప్రియా, కుమార్తె అంజలి, వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ బస చేయడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌కు కుటుంబ సభ్యులతో కలిసి షర్మిల, మాజీ సిఎం జగన్ నివాళ్ళు అర్పించనున్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ మొదటి సంవత్సరం విద్యా ర్థుల కోసం ఎన్‌సిసి ప్రయోజనాలు, కెరీర్ డెవలప్ మెంట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరులోని 35 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్.వి.మోనిష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ లోగనాథన్ హాజర య్యారు. ఈ సందర్భంగా కల్నల్ మోనిష్ మాట్లా డుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వం, బృంద స్ఫూర్తి, సామాజిక బాధ్యత పెంపొందిం చడంలో ఎన్‌సిసి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం మాత్రమే కాకుండా రక్షణ, కార్పొరేట్ రంగాలలోనూ ఎన్‌సిసి గణనీయమైన కెరీర్ అవకాశాలను కల్పిస్తుందని వివరించారు. ఎన్‌సిసి క్యాడెట్లు రక్షణ సేవలలో ప్రత్యేక కోటాలు, స్కాలర్‌షిప్‌లు, నాయకత్వ శిక్షణ, సాహస శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాల వంటి అనేక అవకాశాల నుండి లాభపడతారని పేర్కొన్నారు. బాధ్యతాయుత పౌరులుగా, దేశ భవిష్యత్తు నాయకులుగా ఎదగడానికి ఇది ఒక విలువైన మార్గమని పేర్కొన్నారు. మిట్స్ యాజమాన్యం విద్యా ర్థులను ఎన్‌సిసి కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రక్షణ వృత్తులు, ప్రభుత్వ సేవలు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలను బలోపేతం చేసే స్కాలర్‌షిప్‌లు, రిజర్వ్ కోటాలు, శిక్షణ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కల్నల్ మోసిస్

జిల్లాలో యూరియా కొరత లేదు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి: జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత లేదని కలెక్టర్ శ్రీహరి చామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీలేరులో యూరియా కొరత ఉందంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. పీలేరులోని శ్రీనివాస ఫర్టిలైజర్స్ డీలర్ షాపు ఆదివారం తెరవనందువల్ల సోమవారం ఎక్కువ డిమాండ్ ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ డీలర్ షాపులో ఒక రైతు ఐదు బస్తాల యూరియా అడగగా రెండు బస్తాలు తీసుకోవాలని తర్వాత మళ్లీ మిగిలిన బస్తాలు తీసుకెళ్లవచ్చని తెలిపిన సందర్భంగా చిన్న విషయాన్ని పెద్ద సమస్యగా చూపిస్తూ వార్తలు వస్తున్నాయని వాటిని నమ్మవద్దని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలలో, ప్రయివేటు డీలర్ షాపులలో యూరియా కొరత లేదని రైతులకు సూచించారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - రాయచోటి: పట్టణంలోని శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో, నాందీ ఫౌండేషన్, టెక్ మహీంద్రా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ బి.టెక్ విద్యార్థినుల కోసం సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని టెక్ మహీంద్రా ఫౌండేషన్‌కు చెందిన రిసోర్స్ పర్సన్ గౌతమ్ శంకర్ నిర్వహిస్తున్నారు. ఈనెల 6 వరకు ఉంటుందని, చివరి రోజు విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం, సానుకూల దృక్పథం, టీమ్ స్పిరిట్, వృత్తి నైపుణ్యం వంటి అంశాలను విద్యార్థినులకు బోధిస్తున్నారు. ఈ నైపుణ్యాలు భవిష్యత్ కెరీర్‌లో, క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో విజయానికి పునాదిగా నిలుస్తాయని గౌతమ్ శంకర్ పేర్కొన్నారు. విద్యార్థినుల ఉత్సాహాన్ని అభినందిస్తూ, నేర్చుకున్న విషయాలను నిరంతరం సాధన చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక జ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ కూడా విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌లో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని, మరింత విజయాన్ని సాధించాలని హితవు పలికారు.కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కొత్తపల్లి ఇంతియాజ్ , అధ్యాపకులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేశారు. శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు సమగ్ర అభివృద్ధి కల్పించడం, భవిష్యత్ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దడం కళాశాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

సిపిఎం నాయకుడిని పరామర్శించిన శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు తండ్రి అబ్బవరం వెంకటరమణ ఇటీవల మృతి బాధాకరమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దశదిన ఖర్మకాండకు హాజరైన శ్రీకాంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.రామాంజులు నివాసానికి వెళ్లి వెంకట రమణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, రామాంజులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణానికి చెందిన వైఎస్ఆర్‌సిపి బిసి నాయకుడు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిన్నసంజీవయ్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి పట్టణంలోని చెక్ పోస్ట్ శివాలయం ప్రాంతంలో నివాసమున్న చిన్న సంజీవయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఆరోగ్యవంతు డవ్వాలని అయన ఆకాంక్షించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి జాఫర్ అలీఖాన్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, పట్టణ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా సుధాకర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంపు, కళాశాల అభివద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలియజేశారు. కొత్తగా వచ్చిన ప్రిన్సిపల్‌కు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఎన్‌డిఎ అభ్యర్థికే వైసిపి మద్దతు : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థికే వైసిపి మద్దతు ఉంటుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థి మర్యాదపూర్వకంగా వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ఫోన్ ద్వారా మద్దతు కోరారని తెలిపారు. అందుకు జగన్మోహన్‌రెడ్డి ఇండియా కూటమి అభ్యర్థిని ప్రకటించక ముందే ఎన్‌డిఎ కూటమి అభ్యర్థికి మద్దతు ఇచ్చామన్నారు. ఆ మేరకు జగన్ ఇప్పుడు మీకు మద్దతు ఇవ్వలేమని ఇండియా కూటమికి సున్నితంగా చెప్పారన్నారు. స్థానిక బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కడపలో ప్రెస్‌మీట్ పెట్టి బిజెపి అధిష్టానానికి వ్యతిరేకంగా, ఆ పార్టీకి చెడ్డ పేరు తీసుకువచ్చేలా మాట్లాడడం సరికాదన్నారు. బిజెపి పెద్దలు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డిని అడగకుండా, ఆయన సూచనలు తీసుకోకుండా జగనను నేరుగా కోరడంతో ఆది నారాయణరెడ్డి అసహనానికి గురైనట్లు తెలుస్తోందన్నారు. వైసిపి మద్దతు తమకు అవసరం లేదని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఆది నారాయణరెడ్డి వాస్తవాలను వక్రీకరించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరగక ముందే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనతో ఏర్పడింది స్టీల్ ప్లాంట్ అన్నారు. ఆయన మరణం తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జమ్మలమడుగు ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం కావలసిన అన్ని రకాల అనుమతులను పొందారన్నారు. ఇప్పుడు అదే ఫేస్‌లో స్టీల్‌ప్లాంట్‌ను కొనసాగిస్తూ ఉండకుండా వారే ఈరోజు కొత్తగా పెడుతున్నట్లు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. గండికోట, మైలవరం జలాశయాలకు కృష్ణా జలాలను తీసుకొచ్చేందుకు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం ఫలితమే అన్నారు. వీటిని కూడా ఇప్పుడు వారి ఖాతాలో వేసుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు అన్ని విషయాలు తెలుసని అన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ఇవ్వకుండానే సూపర్‌సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ప్రజా నాడిని తెలుసుకొని ముందుకు వెళితే భవిష్యత్తు ఉంటుందన్నారు. లేకపోతే 2029 ఎన్నికల్లో ఘోరంగా బుద్ధి చెబుతారని పిఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గజ్జల లక్ష్మయ్య, గొరిగనూరు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు గౌతమబోయిన గురుమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఎకరాకూ సాగునీరు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కన్నెలూరు చెరువును ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. చెరువుకు నీరు నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి తాగునీటి ఇబ్బందులు కూడా తొలగుతాయని పేర్కొన్నారు. ఏదైనా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే తన సంకల్పమన్నారు. ఏడాది పొడవునా రెండు పంటలు పండేలా సాగునీరు అందించడానికి తన శక్తి వంచన మేరకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, నీటి సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇత్తడి పరిశ్రమ అభివృద్ధికి కృషి : పీడీ

చాపాడు (మైదుకూరు): వనిపెంట ఇత్తడి పరిశ్రమ అభివృద్ధికి డిఆర్‌డిఎ తరఫున కృషి చేస్తామని డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మైదుకూరు మండలంలోని వనిపెంటలో సోమవారం ఆమె పెన్షన్ పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక పెన్షన్లలో భాగంగా 1వ తేదీనే పెన్షన్ లబ్ధిదారులందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. నోటీసులు మంజూరైన వికలాంగులకు సెప్టెంబర్‌కు సంబంధించిన పెన్షన్ పంపిణీ చేశామన్నారు. అనంతరం వనిపెంట ఇత్తడి పరిశ్రమను ఆమె పరిశీలించారు. వెలుగు సంఘాల ద్వారా ఇత్తడి ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎపిఎం జయరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

ఎర్రగుంట్ల పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగరాజు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నాగరాజు, ఎంసి కొండయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలలలోనే పట్టణ అభివృద్ధికి అనేగా పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేష్ సుబ్బ రామిరెడ్డిఎర్రగుంట్లపై ప్రత్యేకశ్రద్ధ పెట్టారన్నారు. గండికోట ప్రాజెక్టు నుంచి పట్టణానికి రూ.139 కోట్లతో తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, టిడిపి జిల్లా మైనారిటీ సెక్రటరీ పెద్దసేట్, టిడిపి నాయకులు కొండారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువల్లేక రోడ్డుపైకి పంట పొలాల నీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానానికి వెళ్లే రోడ్డుపై పంట పొలాల నీరు పారుతోంది. ఆ దారిన వెళ్లాలంటే ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల్లో ఎక్కువైన నీరు ప్రవహించేందుకు కాలువల్లేక రోడ్డుపై పారుతున్నాయి. బురద నీరు రోడ్డు పైకి చేరడంతో అల్లాడుపల్లెకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బురద అధికంగా ఉండడంతో ద్విచక్ర వాహనాల వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గాన అల్లాడుపల్లె, శ్రీరాముల పేట, పెద్ద గురువులూరు, చిన్న గురువులూరు, ఇతర గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. అధికారులు రోడ్డు పైన పొలాల్లోని నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి పైప్‌లైన్ల గుర్తింపు

ప్రజాశక్తి - చాపాడు :ప్రొద్దుటూరు-మైదుకూరు ప్రధాన రహదారి రోడ్డు విస్తరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాలలో పంచాయతీకి సంబంధించిన మోటర్లు పైపులైన్లు తొల గించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆ మేరకు సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మహమ్మద్ రోడ్డు వెంట ఉన్న గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రధాన రహదారిని 6 మీటర్లు విస్తరిస్తున్నారని తెలిపారు. ఈ విస్తరణలో పల్లవోలు, చాపాడు, పుల్లారెడ్డి నగర్, విశ్వనాథపురం గ్రామాల వద్ద మంచినీటి పథకాలకు సంబంధించిన బోర్లు, పైపులైన్‌లు తొలగించాల్సి వస్తోంది. రోడ్డు నుంచి 6 మీటర్ల పరిధిలో ఉన్న పైపులైన్‌లను గుర్తించి అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పుల్లారెడ్డి నగర్ వద్ద బోరు, పైపులైన్ తొలగించి నూతనంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో బద్రిపల్లె పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

పులివెందుల రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక భాకరాపురం ఆడిటోరియంలో వైఎస్ కుటుంబ సభ్యులు, వైసిపి ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించి, ఘనంగా నివాళి అర్పించనున్నట్లు పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుల సంఘాల, అనుబంధ సంఘాలు, పులివెందుల ప్రజలు తప్పక పాల్గొని విజవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - వేముల :చింతల జూటూరు గ్రామంలో వీధి కుక్కల దాడిలో సోమవారం సాయంత్రం 25 గొర్రెలు, పొట్టేలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి, పుష్పరాజు, రామాంజనేయులు గ్రామ సమీపంలో జీవాలను దొడ్డిలో ఉంచి మేపేవారు. సాయంత్రం 4 గంటల సమయంలో కుక్కలు దాడి చేసి కొన్నింటిని చంపేశాయి. తమకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నష్టపరిహారం చెల్లించాలని, వీధి కుక్కలపై పంచాయతీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం

- 15 రోజుల్లోగా ఖాళీ చేయాలని అధికారుల నోటీసులు
- గడువు పూర్తయినా తొలగించని వైనం
- చర్యలు చేపట్టని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీ వడిసెలవంకపల్లి వద్ద వంకాయనల్లగుట్టను ఆక్రమించి అక్రమంగా షెడ్డు నిర్మించిన గుర్రం మహేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే మూడెకరాలు ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా షెడ్డు నిర్మించుకున్న విషయాన్ని పరిశీలించిన అధికారులు 15రోజుల్లోగా షెడ్డును తొలగించి స్థలాన్ని ఖాళీ చేయాలని, లేకుంటే తామే షెడ్డును తొలగిస్తామని నోటీసులు అందించినట్లు తహశీల్దార్ భాగ్యలత తెలిపారు. రెవెన్యూ అధికారులు విధించిన గడువు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా ఎటువంటి

వంకాయనల్లగుట్ట వద్ద అక్రమంగా నిర్మించిన షెడ్డు

చర్యలు తీసు కోలేదని ప్రజలు చెబుతున్నారు. అధికారుల అలసత్వం వల్లే ఆక్రమణదారులకు అడ్డూ అదుపులేకుండా కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించి కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేత్రదానంతో అంధుల్లో వెలుగులు నింపుదాం

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మహమ్మద్‌రఫీ

ప్రజాశక్తి-కలికిరి

నేత్రదానం చేసి కళ్లు లేని జీవితాల్లో వెలుగులు నింపుదామని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సావాల్లో భాగంగా డిఎంహెచ్‌ఒ ఆదేశాల మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ అంజలిదేవి అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు నేత్రదానం ప్రాముఖ్యత, ఆవశ్యకత, ఎవరు నేత్రదానం చేయవచ్చు, ఎవరిని సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో నేటికీ 1.2మిలియన్ల మంది కార్నియల్ అంధత్వంతో బాధ పడుచున్నారని, ప్రతీ సంవత్సరము 20వేల నుంచి 30వేల కొత్త కేసులు ఈ కార్నియల్ అంధత్వంలో నమోదు అవుతున్నాయన్నారు. నేత్రధానానికి అర్హత ఏ వ్యక్తి అయినా స్త్రీ కానీ పురుషుడు కానీ ఏ మతానికి చెందిన వారైనా నేత్రధానం చేస్తున్నట్టు ప్రకటించిన లేదా ప్రకటించక పోయిన కళ్ల ను దానం చేయవచ్చునని నేత్రధానం చేయుటకు సమీపంలో ఉన్న కంటి బ్యాంకు వారిని సంప్రదించి ఏ వయసు వారైనా, కళ్ళజోడు పెట్టుకునే వారు, షుగర్, బిపి,ఉబ్బసం వ్యాధులతో బాధపడే వారు కూడా నేత్ర దానం చేయ వచ్చన్నారు. మరణించిన ఆరు గంటల లోపు నేత్రలను తీయవలసి ఉంటుందని, చనిపోయిన వెంటనే కుటుంబ సభ్యులు దగ్గర లోని ఐ బ్యాంకు వారికి సమా చారం ఇవ్వాలని, మరణించిన వ్యక్తి వద్ద ఫ్యాన్లు ఆపి వేయాలని, ఏసి, కూలర్ ఆన్ చేసి ఉంచాలన్నారు. నేత్రధానం చేసిన వ్యక్తి నుండి రక్త పరీక్ష కు గాను 10 మి.లీ. రక్తాన్ని తీస్తారని, శిక్షణ పొందిన వ్యక్తి స్టైరైలు పద్ధతి ద్వారా కళ్ళను బయటకు తీస్తారని అన్నారు. దీనివల్ల ముఖం పై ఎలాంటి మచ్చ పడదని, ముఖం వికృతంగా మారదని, దానం చేయబడిన నేత్రాలను ఎన్నడూ అమ్మడం జరగదని చెప్పారు. కార్నియ పొందిన వ్యక్తి పేరును రహస్యంగా ఉంచుతారన్నారు. నేత్రదాన ఉద్యమం లో పాల్గొని ప్రజలను చైతన్యం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గులాబ్జాన్, అధ్యాపకులు, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేదల జీవితాల్లో సూపర్ సిక్స్ పథకాలు వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని 33వ వార్డులో ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయమన్నారు. వితంతువులు, వృద్ధులకు రూ.4 వేలు, పాక్షిక వైకల్యం కలిగిన వారికి రూ.6 వేలు, పూర్తి వైకల్యం కలిగి మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు ప్రతి నెలా ప్రభుత్వం అంది స్తోందని అన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తరలించి రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే వైసిపి నాయకులు జీర్ణించుకోలేకపో తు న్నారని పేర్కొన్నారు. ఐదేళ్లపాటు భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడి ఎపిని సర్వనాశనం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సచివాలయ అడ్మిన్ హరిప్రసాద్‌రెడ్డి, టిడిపి నాయకులు రామిశెట్టి కృష్ణ, మోడెం సిద్ధప్ప, రామిశెట్టి రత్నమయ్య, వేణు గోపాల్, సురేష్, రామిశెట్టి రెడ్డి కేశవ, నరేష్, నవీన్‌చౌదరి, బాలమాలి పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిడిఒ రమేష్‌బాబు పరిశీలించారు. మండలంలోని బండ్లపై, రెడ్డివారిపల్లె, రాచవేటివారిపల్లె గ్రామాలలో జరుగుతున్న పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. మధ్యాహ్నం గవరకు జరిగిన పింఛన్ల నగదు పంపిణీలో మండలం 94.68 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. మండలంలో 5068 పింఛన్దారులు ఉండగా 4792 మంది పింఛనుదారులకు రూ.2,12,81,500లు కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

నందలూరులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామ ప్రజలు

ప్రజాశక్తి-వీరబల్లి

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను ప్రజలు ఏర్పాటు చేశారు. సోమవారం మండలం లోని డి.రాచపల్లి పంచాయతీ పెద్దమాదిగ పల్లెలో డప్పులు, మేళ తాళాలు, రంగులు, బాణాసంచా, గణపతి పప్పా మోరియా అంటూ నిమజ్జనానికి పయనమయ్యారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి పోలీస్, రెవెన్యూ చెరు వులో నీళ్లు ఉండే చోట నిమజ్జనం చేసుకోవచ్చని అనుమతించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎస్ఐ నరసింహారెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలను ప్రజలు వాహనాలలో చెరువు కట్ట వద్దకు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజల కూడా జాగ్రత్త వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో వంగిమళ్ళ పెద్దమాదిపల్లి ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని గాంధీనగర్ లో, ఆర్ఎస్ రోడ్డు లోని పోస్ట్ ఆఫీస్ వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకునికి ఆరు రోజులు పాటు పూజలు నిర్వహించి నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ బాణాసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ ఊరేగింపు చేపట్టారు. అనంతరం కన్యక చెరువులు నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. **మదనపల్లె:** మండలంలోని కొండమారిపల్లి పంచాయతీ టిఎన్ఆర్ కాలనీలో ఘనంగా గణేష్ నిమ జ్జనం వేడుకలు నిర్వహించారు. ముందుగా లడ్డూ వేలం పాట నిర్వహించగా రూ.10116 మొదలై కాలనీకి చెందిన లోకేష్ రూ.20001కు దక్కించుకున్నారు.గణనాథుడిని పల్లకిపై పురవీధుల్లో ఊరేగిస్తూ నిమ్మిజ్జనానికి తరలించారు. డోలు మేళాలతో భాజా భజంత్రీలతో కోలాటలతో నిమజ్జనం సాగింది.కార్యక్రమంలో టిఎన్ఆర్ కాలనీలో ప్రజలు, యువత పాల్గొన్నారు.

వేలంలో రూ.42 వేలు పలికిన లడ్డూ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ గాంధీనగర్‌లోని ఆంజనేయ స్వామి వద్ద వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో లడ్డు రూ.42,500లు ధర పలికింది. అదే గ్రామానికి చెందిన గాదెన అరుణ్‌కుమార్ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం అరుణ్‌కుమార్‌ను మేళతాళాల నడుమ ఊరేగింపుగా లడ్డూను ఇంటికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని అనంతపల్లి పంచాయతీ జానకిపురం గ్రామంలో వినాయక చవితి 12వ వార్షికోత్సవం నిమజ్జనం పురస్కరించుకొని లడ్డూ వేలంపాట నిర్వహించారు. కోడూరు వాసుఅఖిల్ రూ.25వేలకు వినాయక లడ్డూను కైసవం చేసుకున్నారు. మండల వ్యాప్తంగా విగ్రహాలు మంగంపేటలో నిమజ్జనం చేశారు. స్థానిక ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా నిమజ్జనం నిర్వహించారు.

పుల్లంపేటలో వేలంలో లడ్డూను దక్కించుకున్న వాసుఅఖిల్

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ విక్రాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని అన్నారు. సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలతో ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారని అన్నారు. తంబళ్లపల్లె సిహెచ్‌సిలో రోజూ 200 నుంచి 230 వరకూ ఓపి ఉండగా అత్యధికంగా జ్వరం, జలుబు, దగ్గు పేషెంట్లు ఉన్నారని. మండలంలో వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటిలోని నీటితొట్టెలు, కూలర్లు తరచుగా శుభ్రంగా చేసుకోవాలని చెప్పారు. టెంకాయచిప్పలు, టైర్లు ఉంటే దూరం గా పడవేయాలని చెప్పారు. దోమలవల్లనే విషజ్వరాలు ప్రబలుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు.

12వ ఏటనే కావ్య సృష్టి చేసిన మహాకవి 'పుట్టపర్తి'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సరస్వతీపుత్ర, పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు తన 12వ ఏటనే పెనుగొండ లక్ష్మి అనే కావ్యాన్ని రచించారని పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పుట్టపర్తి 35వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక శివాలయం సర్కిల్లో పుట్టపర్తి విగ్రహానికి పూలమాలవేసి పీఠం సభ్యులు నివాళి అర్పించారు. అనంతరం అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో జింక సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచంలో ఏ కవికి జరగని విధంగా తాను రచించిన కావ్యమే తనకు పాఠ్య గ్రంథంగా రావడం అపురూపమన్నారు. ఆయన 14 భాషల్లో పాండిత్యం సంపాదించి ఎనిమిది భాషల్లో కావ్య సృష్టి చేశారని కొనియాడారు. పుట్టపర్తి పీఠం ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, డాక్టర్ రామాంజనేయులు రెడ్డి, తవ్వా సురేష్ రెడ్డి, కొత్తపల్లి శీను, ఆరవేటి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు రాగి గీత,సుందరం పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన చిత్తూరు, కడప మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, కడప జట్ల మధ్య మూడు రోజుల పాటు జరిగిన బ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 589 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 99 పరుగుల ఓవర్ నైట్ కోరుతూ చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 117.4 ఓవర్లలో 406 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది.మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు ఆధిక్యత సాధించింది.

రాష్ట్ర అదనపు కార్యదర్శిగా పరశురాం

ప్రజాశక్తి-గాలివీడు

మానవహక్కుల పరిరక్షణ సంస్థ(హ్యూమన్‌రైట్స్) రాష్ట్ర అదనపు కార్యదర్శిగా గాలివీడుకు చెందిన బండి వెంకటసాయి పరశురాంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసంతో ఇంతటి బాధ్యతను అప్పజెప్పిన ఎన్‌హెచ్ ఆర్‌పి, ఎసిఎఫ్‌ఫౌండర్, చైర్మన్ టీఎస్ రామచంద్ర నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ అధికారి వెంకటాచలపతి తెలిపారు. 132కెవి మెయిన్ లైన్ మరమ్మతుల కారణంగా చిట్వేలితో పాటు చుట్టూ పక్కల గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చక్రాయపేట : వేంపల్లి సమీపంలో ఉన్న మదర్‌థెరిసా అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం సాయంత్రం మారెళ్ల మడక గ్రామానికి చెందిన బొజ్జ రఘునాథ్‌రెడ్డి తన సతీమణి ధనమ్మ మూడో వర్ధంతిని పునస్కరించుకుని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ నిరాశ్రయులకు తమ వంతు సహాయ సహకారాలు అందిం చినప్పుడే సమాజం సుఖశాంతులతో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతోపాటు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సహాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నరసిం హులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లె దేవళాలులో..

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవాలయ ఆవర ణలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి పల్లకీసేవ చేశారు. బద్రిపల్లి సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి టిడిపి యువ నాయకుడు దీక్షిత్ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

హామీలు సూపర్‌హిట్ అనడం హాస్యాస్పదం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె : సూపర్‌సిక్స్ హామీలు సూపర్‌హిట్ అని టిడిపి కూటమి నాయకులు పదేపదే చెప్పుకోవడం హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చేదానికి ప్రధాన కారణం సూపర్‌సిక్స్ హామీలే అన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఆ హామీల్లో ప్రధానమైనవి ఇంకా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి అమలు చేయ లేదన్నారు. అక్టో బర్ నుం చైనా ఆ హామీని బకా యిలతో స హా అమలు చేయా లని తుల సిరెడ్డి డిమాండ్ చే శారు. ఆడ బిడ్డ పథకం, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనా రిటీలకు ఇస్తా నని చెప్పిన పెన్షన్ అమలు చేయా లని కోరారు. 20 24-25 విద్యా సంవ త్సరానికి సం బంధించి తల్లికివందనం పెండింగ్ బకా యిలను కూడా ఇవ్వాలని డి మాండ్ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతే జీవన ప్రగతికి నాంది

ప్రజాశక్తి-చాపాడు : సైబర్ నేరగాళ్ల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెర్డ్స్ కో-ఆర్డినేటర్ కె.ఉదయ్ కుమార్ సూచించారు. మం డల పరిధిలోని శ్రీరా ములపేటలో సోమవారం హెల్త్ ఎడ్యు కేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వ ర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో వెలుగు సిసి సురేంద్ర, హెర్డ్స్ సంస్థ అధ్యక్షుడు పి.కృష్ణయ్య యాదవ్, వెలుగు సిసి జీవన్, సచి వాలయ సర్వేయర్ లక్ష్మణ్, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక బెంగళూరు రోడ్డు, నక్కలదిన్నె, చుక్కలతండాకు చెందిన చంద్రశేఖర్‌నాయక్ భార్య చంద్రకళ(27) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆమెను ఉరి నుంచి తప్పించి స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు ఆమె అప్పటికే చనిపోయిందని తెలిపారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బైక్ ఢీ : వికలాంగుడు మృతి

ప్రజాశక్తి- పుల్లంపేట

కడప-రేణిగుంట జాతీయ రహదారిపై రామక్కపల్లె సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీకొనడంతో ఉమ్మడి శ్రీనివాసులు(45)అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పుత్తనవారిపల్లె గ్రామా నికి చెందిన శ్రీనివాసులు విభిన్న ప్రతిభావంతుడు. ఇతనికి ఒక కన్ను లేదు లేదు. తన భార్యాబి డ్డలను పోషించుకోవడానికి అప్పయ్యరాజుపేట సమీపంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగించేవాడని అన్నారు. సోమవారం యథావిధిగానే పెట్రోల్ బంకులో పనిచేయడానికి తన ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. రామక్కపల్లె సమీపంలోకి రాగానే తన ముందు వెళుతున్న కారును ఓవర్టేక్ చేయడానికి ప్రయత్నించగా ఎదురుగా లారీ రావడంతో అతివేగంగా దానిని ఢీకొ ట్టాడు. సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పుల్లంపేట ఎస్ఐ శివకు మార్, హెడ్ కానిస్టేబుల్ విజయ భాస్కర్, కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు సంఘటనా స్థలానికి చేరు కుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు వైపు రోడ్డు మీద ఉన్న లారీని బైక్ ను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుర్తు తెలియని వ్యక్తి సోమవారం పట్టణంలో మృతి చెందాడు. రెండో పట్టణ సిఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోమటివాని చెరువు సమీపంలోని 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. చిత్తుకాగితాలను ఏరుకోవడానికి వచ్చినట్లు వ్యక్తి గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 9491074519కు సమాచారం అందిం చాలని సిఐ కోరారు.

గోడకూలి విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గాయపడిన విద్యార్థి భరత్

పాఠశాలలో బాత్‌రూము గోడ కూలడంతో విద్యార్థికి గాయాలైన సంఘటన సోమవారం మండల కేంద్రం తంబళ్లపల్లిలోని గోపిదిన్నె ప్రభుత్వ పాఠ శాలలో జరిగింది. బాధితుడి వివరాల మేరకు. .ఎలప వారిపల్లెకు చెందిన గంగప్ప కుమారుడు భరత్ పదవ తరగతి చదువుతున్నాడు. మధ్యా హ్నం భోజనం సమయంలో బాత్‌రూ ముకు వెళ్లగా గోడ కూలడం తో కాలు విరిగింది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తు న్నారు. కొత్త ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఉపాధ్యాయులు వినియోగించు కుంటుండటంతో విద్యార్థులను అనుమతించక లేదని చెబుతున్నారు. పాత మరు గుదొడ్లనే విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో కూలిపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి ప్రమాదకంగా ఉన్న గోడలను తొల గించి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.